***RELEASED FROM***

***CPI(M) state office***

H.No. 27-30-3, CPI(M) State Committee Office

Akulavari Street, Governor Pet, Vijayawada -2

☎ 0866 - 2577202

E-mail: cpimap@gmail.com

## - వామపక్ష పార్టీలు

**ప్రచురణార్థం/ప్రసారార్థం:**

ఆర్. లక్ష్మయ్య,
ఆఫీసు కార్యదర్శి - సిపిఐ(యం)
వామపక్ష పార్టీల తరపున
ఫోన్ : 9490300056

**విజయవాడ,**
**తేది : 03.10.2015.**

# కార్మికుల పట్ల ముఖ్యమంత్రి బెదిరింపు వ్యాఖ్యలకు ఖండన

విశాఖలో 29.09.2015న జరిగిన ఉత్తర కోస్తా ఫార్మా కంపెనీల, పరిశ్రమాధిపతుల సమావేశంలో కార్మిక సంఘాల పట్ల కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు వార్తలొచ్చాయి. సంపద సృష్టించే కార్మికుల్లో తీవ్ర ఆందోళనకు, ప్రభుత్వం పట్ల నిరసనకు కారణమైంది. అదే సమావేశంలో ముఖ్యమంత్రి రాజకీయ పార్టీల పట్ల కొన్ని అభ్యంతరకర వ్యాఖ్యలు చేసారు. ప్రభుత్వ కార్మిక వ్యతిరేక వైఖరిని ఖండిస్తున్నాము.

సకల సంపదలకు మూలం శ్రమ. కార్మికుల శ్రమతోనే సంపద సృష్టించబడుతున్నది. ఈ వాస్తవాన్ని గుర్తెరగడంవల్లే కార్మికులకు దశాబ్దాల కిందటే కొన్ని చట్టాలూ, హక్కులూ సంక్రమించాయి. ఆ చట్టాలనే తెలుగు దేశ ప్రభుత్వం యజమానులకు అనుకూలంగా సవరించింది. కార్మికులు మరణిస్తే ఉన్న చట్టాలను అమలు చేయాలని కార్మికులూ, కార్మిక సంఘాలూ కోరాయి. కార్మికుల చట్టాలనూ అమలు చేయించాల్సిన ప్రభుత్వం, కార్మికులను పీడిస్తున్న యజమానులకు వత్తాసు పలకడం అన్యాయం. పైగా అది తెలుగుదేశం పార్టీ విధానమని సమర్థించుకున్నారు. ఈ వైఖరిని ప్రజలు ఖండించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

రాష్ట్రంలో సెప్టెంబరు 28వ తేదీన మూడు పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో నలుగురు కార్మికులు మృతి చెందారు. మరికొంత మంది కార్మికులు ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. వీరంతా ఫ్యాక్టరీల్లో విధి నిర్వహణ ప్రమాదాల్లో మరణించినవారే. అందులో 'గంగవరం పోర్టు'లో ఒక కార్మికుడు, 'సాయినార్ ఫార్మా కంపెనీ'లో ఇద్దరు, 'రాజమండ్రి ఇంటర్నేషనల్ పేపర్ మిల్లు'లో ఓ కార్మికుడు చనిపోయారు. 08.09.2015న నెల్లూరు జిల్లా తడ మండలం మాంబట్టులోని 'ఇండస్ కాఫీ పొడి కర్మాగారం'లోని బాయిలర్‌లో పనికి వెళ్ళిన ముగ్గురు కార్మికులు ప్రమాదంలో చనిపోయారు. పరవాడ ఫార్మా, అచ్చుతాపురం ఎస్ఇజెడ్‌లో కార్మికులు తరచూ ప్రమాదాలతో చనిపోతూనే ఉన్నారు. విజయశ్రీ ఆర్గానిక్‌ఫార్మాలో గత సంవత్సరం ఒకరు చనిపోయారు. గ్లోసమ్ ఫార్మాసిటీలో ఇద్దరు, ఆర్టాస్ ఫార్మాలో ఇద్దరు, అచ్చుతాపురం ఎస్ఇజెడ్‌లోని ఆంజనేయ పెట్రో ఎల్లాయిస్ కంపెనీలో బాయిలర్ పేలి ఇద్దరు కార్మికులు చనిపోయారు. విశాఖ ఉక్కు కార్మాగారంలో విధి నిర్వహణలో చనిపోయిన ఘటనలు చాలా ఉన్నాయి. ఇలాంటి ప్రమాదాలు నిరంతరం ఏదో ఒక మూల జరుగడానికి కారణం పరిశ్రమల్లో చట్టాలను అమలు చేయకపోవడమే. రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ఈ విషయాలు పట్టకపోవడం ఆందోళన కలిగిస్తుంది. పైగా కార్మిక సంఘాలను నిందించడం మరింత అన్యాయం.

కార్మికుల న్యాయమైన కోర్కెలను కూడా యాజమాన్యాలు అమలు చేయకపోవడాన్ని – సహించకపోవడాన్ని ముఖ్యమంత్రిగారు సమర్థించారు. వలస కార్మికులను హీనమైన వేతనాలతో వేధిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వానికి పట్టడం లేదు. కనీస వేతనాలు, 8 గంటల పని, సమాన పనికి సమాన వేతనం లాంటివి అమలు చేయడంలేదు. యూనియన్ అన్నందుకే ఉద్యోగాల నుండి తొలగిస్తున్నారు. కార్మిక శాఖ వారు కార్మికులకు న్యాయం చేయకపోగా యజమానుల పట్ల వకాల్తా పుచ్చుకుని వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రిగా ట్రేడ్ యూనియన్లను సహించరాదని ప్రకటించడం తీవ్ర అభ్యంతరకరమైన అంశం. ఈ వైఖరిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌కు గానీ, లేబర్ అధికారులకు గానీ, పరిశ్రమల్లో తనిఖీలు చేసే అధికారం చంద్రబాబు తొలగించారు. లేబర్ డిపార్ట్‌మెంటును మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంటుగా మార్చారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు రిజిస్ట్రర్లు లేవు. ఇఎస్ఐ, పిఎఫ్, ఆదివారం సెలవు, బోనస్ వంటి కనీస చట్టాలకు కోరలు లేకుండా చేశాడు చంద్రబాబు. ఉపాధికి రక్షణ లేదు. తెలుగుదేశం పాలన బెదిరింపులతో నేడు పూర్తిగా కార్మిక వ్యతిరేకమైందిగా తయారైంది. దీన్ని కార్మికులు, యావత్తు ప్రజానీకం ఖండించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

| | | | |
|---|---|---|---|
| **పి. మధు**<br>సిపిఐ(ఎం) | **కె. రామకృష్ణ**<br>సిపిఐ | | **గుర్రం విజయకుమార్**<br>సిపిఐ(ఎంఎల్) |
| **జి. దివాకర్**<br>సిపిఐ(ఎంల్) న్యూడెమోక్రసి | **చిట్టిపాటి వెంకటేశ్వర్లు**<br>సిపిఐ (ఎంల్) న్యూడెమోక్రసి | | **వెంకటరెడ్డి**<br>ఎంసిపిఐ(యు) |
| **మూర్తి**<br>సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ | **సుందరరామరాజు**<br>ఫార్వర్డ్‌బ్లాక్ | **జానికి రాములు**<br>ఆర్ఎస్‌పి | **అమర్‌నాథ్**<br>ఎస్‌యుసిఐసి |